ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 21 మే 2024

విస్తారంగా వర్షాలు

ఆత్మకూరు మండలంలో తడిసిన ధాన్యం



గాలివాన బీభత్సానికి డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద విరిగిపడ్డ చెట్టు

అనంతపురం అర్బన్/ఆత్మకూరు, మే 20: ఖరీఫ్ ఆరంభానికి ముందు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని 28 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 54 మి.మీ. వర్షపాతం నమోదైంది. కుందుర్పి 48.6, బెళుగుప్ప 48.4, శెట్టూరు 42.4, విడపనకల్లు 41.2, కూడేరు 33.4, కంబదూరు 32.6, గుమ్మఘట్ట 32.4, బొమ్మనహాళ్ 32.0, ఉరవకొండ 26.0, డి.హీరేహాళ్ 25.4, కణేకల్లు 24.0, రాయదుర్గం 22.0, రాప్తాడు 19.0, శింగనమల 17.8, కళ్యాణదుర్గం 15.6, పెద్దవడుగూరు 15.2, అనంతపురం 14.2, బ్రహ్మసముద్రం 13.2, బుక్కరాయసముద్రం 13.0, గుంతకల్లులో 11.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాలలో 9.6 మి.మీ. వరకూ వర్షపాతం నమోదైంది.



ఆర్ఎఫ్‌రోడ్డులో ఒరిగిన కరెంటు స్తంభం

- జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాలనీల్లో రోడ్లు జలమయం అయ్యాయి. నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు చీకట్లో గడపాల్సి వచ్చింది. శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, పామిడి, పెద్దవడుగూరు తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. యాడికిలో చిరుజల్లులు పడ్డాయి.

తడిసిన ధాన్యం

ఆత్మకూరు మండలంలో వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో వరి మడులు ఈదురుగాలులు, వర్షానికి నేలవాలాయి. నూర్పిడి చేసి ఆరబోసిన వరిధాన్యం తడిసిపోయింది. చేతికి వచ్చిన పంట దిగుబడి నానిపోయిందని మదిగుబ్బ తండా రైతు ఆనంద్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. వర్షం కారణంగా జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు.

నిర్లక్ష్యపు హింస..!

- పోలీసుల తీరే గొడవలకు కారణం
- వైసీపీ గుప్పిట్లో తాడిపత్రి పోలీసులు
- పోలింగ్‌కు ముందు.. తరువాత ఇదే తీరు
- కొత్త ఎస్పీని పక్కదారి పట్టించిన ఎస్‌బీ..?
- సిట్ దర్యాప్తుతో 'వైసీపీ పోలీస్'లో గుబులు

అనంతపురం క్రైం, మే 20: ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా స్పందిస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంది. దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసింది. దీంతో వైసీపీకి వత్తాసుపలుకుతూ, హింసను నియంత్రించకుండా నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులలో దడ మొదలైంది. కౌంటింగ్ అనంతరం మరోమారు గొడవలు జరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో.. శాంతిభద్రల అంశం మరింత కీలకంగా మారింది. జిల్లాకు డీఐజీ, ఎస్పీతోపాటు కొందరు డీఎస్పీలు, సీఐలు కొత్తగా వచ్చారు. స్థానిక పరిస్థితులను అవగాహన చేసుకుని, గొడవలు జరగకుండా చూడటం వీరికి కత్తిమీద సాములా మారనుంది. ఇప్పటిదాకా జరిగిన గొడవలకు, పేట్రేగిన హింసకు పోలీసుల వైఖరే కారణమని జనం విమర్శిస్తున్నారు. మరీ ముఖ్యంగా తాడిపత్రి ప్రాంతంలో చాలామంది పోలీసులు వైసీపీ గుప్పిట్లో ఉన్నారని విమర్శలు వస్తున్నాయి.

కీలక నాయకులపై కేసులు

తాడిపత్రి పట్టణంలో పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లకు 728 మందిని బాధ్యులను చేస్తూ ఎన్నికల కమిషన్‌కు సిట్ నివేదిక అందించింది. టీడీపీ, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులను, కీలక నేతలపైనా కేసులు పెట్టారు. టీడీపీలో మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు, టీడీపీ అభ్యర్థి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, జేసీ పవన్‌కుమార్‌రెడ్డి, సూర్యముని, కాకర్ల రంగనాథ్, జగదీశ్వర్‌రెడ్డి, పొట్టి రవి, విజయ బార్ బాబు, గోరా హాజీ, దాసరి కిరణ్, మల్లికార్జునరెడ్డి, గండికోట కార్తీక్, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, జయుడుతో పాటు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వైసీపీ నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్ ఎరెడ్డి, జావిద్, సజ్జలదిన్నె రాజు, కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, రవితేజరెడ్డితోపాటు పలువురు కీలక నాయకులపై కేసులు నమోదైనట్లు తెలిసింది. మొత్తం ఏడు కేసులలో 728 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వారిలో ఇప్పటికే 91మందిని రిమాండ్‌కు పంపారు.



ఇటీవల తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు

728 మందిపై కేసులు

తాడిపత్రి టౌన్,: పోలింగ్, ఆ మరుసటి రోజు తాడిపత్రిలో జరిగిన గొడవలకు సంబంధించి 728 మందిపై కేసు నమోదైంది. రెండు రోజులపాటు జరిగిన హింసపై మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి. నిందితులలో 396 మందిని పోలీసులు గుర్తించారు. మరో 332 మందిని గుర్తించాల్సి ఉంది. నిందితుల్లో టీడీపీ, వైసీపీకి చెందిన 91 మందిని ఇప్పటికే అరెస్టు చేసి, కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తాడిపత్రిలో జరిగిన హింస, పోలీసుల నిర్లక్ష్యంపై సిట్ అధికారులు రెండు రోజులపాటు దర్యాప్తు చేశారు. సమగ్ర వివరాలను సేకరించారు. కేసుల వివరాలను ఎన్నికల సంఘానికి నివేదించారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే..

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల గొడవలు ఎక్కువగా జరిగే ప్రమాదం కనిపిస్తోంది. కౌంటింగ్ అనంతరం పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తాడిపత్రి అల్లర్లలో పాల్గొన్నది గ్రామీణప్రాంతాలవారే అని స్థానికులు చెబుతున్నారు. తాజాగా కనాగనపల్లి మండలం ఎలక్కుంట్లలో వైసీపీ సానుభూతిపరుడు కుళ్లాయప్ప వేటకొడవలి పట్టుకుని హల్‌చల్ చేశాడు. టీడీపీ నాయకులను పరుష పదజాలంతో దూషించాడు. ఊరు వదిలి వెళ్లాలని హెచ్చరికలు చేశాడు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యవహారాలు గ్రామాల్లో శాంతిభద్రతలకు ముప్పు కలిగిస్తాయి. వైసీపీ వర్గీయులు రౌడీయిజం చేసినా పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై సిద్ధం సభలో దాడి చేసినవారిలో కీలక నిందితుడు బండి రవిని పోలీసులు పట్టుకునే ఆలోచనే చేయలేదు. దీంతో అతను నెలన్నర క్రితం తన స్వగ్రామం కోనాపురంలో టీడీపీ కార్యకర్తపై దాడి చేశాడు. అయినా నామమాత్రపు కేసుతో సరిపెట్టారు. ఎన్నికల్లో దర్జాగా ఓటు వేశాడు. డీఎస్పీ స్థాయి అధికారిని అడిగినా.. 'కనిపించడం లేదు.. ఎక్కడైనా కనిపిస్తే చెప్పండి.. వెంటనే పట్టుకుంటాం' అని విలేకరులకు సమాధానం చెబుతున్నారంటే.. జిల్లాలో పోలీసుల వ్యవహార శైలి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి అధికారులు ఉంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎలా సాధ్యం..?

మిగిలిన వారిలో 305 మందిని గుర్తించామని, 332 మందిని గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం దొరికిన వారు మినహా.. చాలామంది అజ్ఞాతంలో ఉన్నారు.

వైఫల్యమా..? వత్తాసా..?

పోలీసు అధికారులు కొత్తగా వచ్చారు.. వారిని ఏమారుద్దాం అనుకునే పాత అధికారులపై ఎన్నికల కమిషన్ డేగ కన్ను వేసింది. పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్ అత్యంత కీలకం. తాడిపత్రిలో డీఎస్పీ చైతన్య ప్రవర్తన, ఎస్పీ అమిత్ బర్దర్‌పై సస్పెన్షన్ వేటు.. ఈ విభాగం పనితీరు ఎలా ఉందో చెప్పకనే చెబుతున్నాయి. వైసీపీ కోసమే గతంలో పనిచేసిన డీఎస్పీ చైతన్య.. తాడిపత్రికి వెళితే ఏమౌతుందో కొత్తగా వచ్చిన ఎస్పీకి స్పెషల్ బ్రాంచ్ అధికారుల సహా.. ఏ ఒక్కరూ చెప్పకపోవడం తప్పుదారి పట్టించడం కాదా..? అన్న విమర్శలు వస్తున్నాయి. ఎస్బీలో అంతా తానై చక్రం తిప్పుతున్న ఓ అధికారి, టీడీపీకి అనుకూలమనే నెపంతో చాలామంది పోలీస్ సిబ్బందిని లా అండ్ ఆర్డర్‌కు దూరంగా.. తనిఖీల పేరుతో చెక్‌పోస్టు డ్యూటీలకు పంపేలా చేశారు. డీఎస్పీ చైతన్యను ఈయనే తాడిపత్రికి రప్పించారనే ప్రచారం జరుగుతోంది. ఎన్నికల రోజు ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఆయన ఉన్న చోటే ఉండేలా చూడాలని పోలీసు ఉన్నతాధికారి ఆదేశించారు. కానీ కాసేపటికి ఆయన జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఉన్న చోటుకు వచ్చారు. దీంతో గొడవ ముదిరింది. 'పెద్దారెడ్డిని అక్కడే ఉండేలా చూడమన్నా కదా.. ఎందుకు రానిచ్చారు..?' అని ఆ ఉన్నతాధికారి డీఎస్పీని అడిగితే.. 'ఏం చేయమంటారు సార్.. ఆయన మా మాట వినడం లేదు' అన్నారట. అందుకే ఆ డీఎస్పీపై సస్పెన్షన్ వేటు పడిందని అంటున్నారు. పోలీసు అధికారుల తీరు ఇలా ఉంటే శాంతిభద్రతలు ఎలా అదుపులో ఉంటాయని జనం ప్రశ్నిస్తున్నారు.

తాడిపత్రి డీఎస్పీగా జనార్దన్ నాయుడు



అనంతపురం క్రైం: తాడిపత్రి డీఎస్పీగా కె.జనార్దన్ నాయుడును నియమిస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో ఏలూరు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న సీఐ పి.నాగేంద్రప్రసాద్‌ను తాడిపత్రి సీఐగా నియమించారు. ఇక్కడే వీఆర్‌లో ఉన్న మరో సీఐ ఎ.విశ్వనాథచౌదరిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్ విభాగానికి సీఐగా నియమించారు. పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవలను నియంత్రించడంలో విఫలమైన తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

బెంగళూరు చూడాలని..

అనంతకు చేరిన మహారాష్ట్ర బాలికలు... తల్లిదండ్రుల చెంతకు చేర్చిన అధికారులు

అనంతపురం విద్య, మే 20: బెంగళూరు చూడాలన్న ఆసక్తితో ఇంట్లో చెప్పాపెట్టకుండా వచ్చిన ఇద్దరు బాలికలు జిల్లాలో తేలారు. ఆర్పీఎఫ్, ఐసీడీఎస్ అధికారులు వారిని మూడు రోజుల తర్వాత సోమవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు బాలికలు ఇంటి నుంచి పారిపోయి ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఈ నెల 18న ప్రయాణిస్తుండగా.. గుంతకల్లు ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. వారి గురించి సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మికి, చైల్డ్‌లైన్ 1098 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆర్పీఎఫ్ సంరక్షణలో బాలికలను అదే రోజు రాత్రి 12 గంటలకు అనంతపురంలోని బాలసదన్‌కు చేర్చారు. అనంతరం బాలికల తల్లిదండ్రులను పిలిపించిన ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు.. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫికర్ల చేతికి బాలికలు చిక్కి ఉంటే వారి జీవితం ప్రమాదంలో పడేదని అన్నారు. ఒంటరిగా బయటకు రాకూడదని బాలికలకు సూచించారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్, సభ్యులు కామేశ్వరి, ఓబులపతి, డీసీపీఓ మంజునాథ్, ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో బాలికలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

అడ్డుకోండి.. అడ్డుకోండి..!

జేసీ ప్రభాకర్ వస్తున్నారని పోలీసుల అలర్ట్...

తెల్లవారుజామునే పరుగులు.. తనిఖీలు

తాడిపత్రి టౌన్, మే 20: హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తిరిగి వస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. పోలింగ్ నేపథ్యంలో తాడిపత్రిలో భారీగా హింస చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు ఆయన కుటుంబం మొత్తాన్ని హైదరాబాద్‌కు తరలించారు. సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబాన్ని సైతం తాడిపత్రి నుంచి ఆయన స్వగ్రామం తిమ్మంపల్లికి పంపించారు. పోలింగ్ మరుసటి రోజున గొడవలను నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి అస్వస్థతకు గురై.. హైదరాబాదులోని కిమ్స్‌లో అడ్మిట్ అయ్యారు. ఆయన ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జి అయ్యారని, తాడిపత్రికి వస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఆయన తిరిగి వస్తే మరోసారి సమస్య తలెత్తుతుందని భావించిన పోలీసులు.. ఆయనను పట్టణంలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు శివారు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసిన తరువాతే తాడిపత్రిలోకి అనుమతించారు. కడప, బుగ్గ, చుక్కలూరు, అనంతపురం రోడ్లలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు ప్రారంభించారు. చెక్‌పోస్టుల వద్ద అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు శివారెడ్డి, శ్రీనివాసులు, సీఐలు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాగార్జునరెడ్డి ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి తమ కళ్లుగప్పి పట్టణంలోకి వస్తారేమోనన్న అనుమానంతో పట్టణంలోని ఆయన నివాసం వద్ద, అశోక్ పిల్లర్ వద్ద భద్రతను మరింత పెంచారు. కానీ ఆయన రావడం లేదని తేలడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. తనిఖీలలో ఎస్ఐలు సాగర్, గౌస్‌బాషా, స్పెషల్ పార్టీ పోలీసులు, ర్యాపిడ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



చుక్కలూరురోడ్డులో బస్సును ఆపి తనిఖీ చేస్తున్న పోలీసులు

మామిడి అమ్మి.. మస్కా



వేలాది మామిడి చెట్లు

ఓపెన్ ఎయిర్ జైలు అధికారులకు బురిడీ

లీజు సొమ్ము చెల్లించని అధికార పార్టీ నేత

ఒప్పందం మేరకు రూ.30 లక్షలు బకాయి

క్రిమినల్ కేసు పెట్టేందుకు అధికారులు సిద్ధం

బుక్కరాయసముద్రం

అధికార పార్టీ నాయకుడు అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలుకు మస్కా కొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. వేలంపాటలో దక్కించుకున్న మామిడి పంటకు ఈ ఏడాది లీజు సుమారు రూ.30 లక్షలు చెల్లించకుండా, ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే 50 శాతం దిగుబడులను అమ్ముకున్న లీజుదారు.. తనకు నష్టం వచ్చిందని, లీజు చెల్లించేది లేదని చెప్పినట్లు సమాచారం. దీంతో జైలు అధికారులు క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు.

అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులోని వ్యవసాయ క్షేత్రంలో అతి పెద్ద పంట మామిడి. ఇక్కడ సుమారు 200 ఎకరాల్లో 4,280 మామిడి చెట్లు ఉన్నాయి. సహజ ఎరువలతో, రసాయన రహితంగా పంట పండిస్తారు. అందుకే ఇక్కడి మామిడి పండ్లకు హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాలలో మంచి డిమాండ్ ఉంటుంది. ధర కూడా బాగా పలుకుతుంది. గతంలో జైలు ఆధ్వర్యంలోనే మామిడి పండ్లను విక్రయించేవారు. కానీ 2022లో జైళ్ల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మామిడి తోటలను వేలం వేసింది. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు మామిడి చెట్లను బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పదేళ్లపాటు హక్కులను వేలంలో దక్కించుకున్నారు. తొలి ఏడాది రూ.26.50 లక్షలు, ఆ తరువాత ఏడాదికి ఐదు శాతం ఎక్కువ ధర చెల్లించేలా లీజు అగ్రిమెంట్ రాసుకున్నారు. ఒప్పందం మేరకు తొలి ఏడాది రూ.26.50 లక్షలు, 2023లో రూ.27,82,500 చెల్లించాడు. ఆ రెండేళ్లు మామిడి పంటలో మంచి దిగుబడి వచ్చింది. లీజుదారు భారీగా లాభాలు ఆర్జించాడు. వ్యవసాయ క్షేత్రంలో అంతర పంటలనుకూడా సాగు చేసి లబ్ధిపొందాడు. ఈ ఏడాది లీజు మొత్తం రూ.29,21,625 చెల్లించాల్సి ఉంది. ఒప్పందం మేరకు ఏటా జనవరిలో అగ్రిమెంట్ రెన్యువల్ చేసుకోవాలి. కానీ ఈ ఏడాది రెన్యువల్ చేసుకోలేదు. పైగా ఏప్రిల్ నెలలో మొత్తం సొమ్ము చెల్లించిన తరువాత మామిడి దిగుబడులను విక్రయించాలి.. కానీ జైలు అధికారులకు మస్కా కొట్టి.. 50 శాతం పంటను లీజుదారు విక్రయించాడు. లీజు మొత్తం అడిగితే.. తనకు నష్టం వచ్చిందని, చెల్లించేది లేదని చేతులు ఎత్తేసినట్లు తెలిసింది.

చర్యలకు సిద్ధమైన అధికారులు

అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు ఒప్పందం ప్రకారం లీజు సొమ్ము మంగళవారంలోగా చెల్లించాలని జైలు అధికారులు సూచించినట్లు తెలిసింది. లేక పోతే క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించినట్లు సమాచారం. లీజుదారుడి నుంచి సొమ్ము రాబట్టేందుకు జైలు అధికారులు గత పది రోజులుగా ప్రయత్నిస్తున్నారు. తాను బెంగళూరులో ఉన్నానని, రావడానికి ఆలస్యం అవుతుందని అతను సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మంగళవారం వచ్చి నగదు చెల్లించాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పినట్లు సమాచారం.

డబ్బు కట్టాల్సిందే..



వేలం పాటలో దక్కించుకున్న వ్యక్తి లీజు మొత్తాన్ని చెల్లించాల్సిందే. లేక పోతే చట్టపరమైన చర్యలు తప్పవు. ఏప్రిల్‌లోనే కట్టాల్సిన నగదును ఇప్పటి వరుకు చెల్లించలేదు. జైలు వద్దకు మంగళవారం వస్తానని లీజుదారుడు చెప్పాడు. కానీ నగదు చెల్లింపు విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయం రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. లాభనష్టాలతో సంబంధం లేకుండా లీజు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని అగ్రిమెంట్‌లో ఉంది. నష్టం వచ్చిందని చెల్లించకపోతే చర్యలు తప్పవు.

\- చిన్నారావు, జైలు సూపరింటెండెంట్

మగ్గానికి ఉరి

నేతన్న బతుకు విషాదాంతం



కుళ్లాయప్ప ఉరివేసుకున్న మగ్గం, ఫైల్‌ఫొటో

ఆ మగ్గం మీద ఎన్ని కోట్ల నూలు పోగులను ఏకం చేసి ఉంటాడో..! ఆ చేత్తో ఎన్ని వందల చీరలను నేసి ఉంటాడో..! అతడి రంగురంగుల ఆవిష్కరణలు శుభకార్యాల్లో మహిళల ముఖాల్లో వెలుగులు నింపి ఉంటాయి. కానీ అతడి జీవితంలో మాత్రం చీకట్లు తొలగలేదు. అదే మగ్గం.. అవే చేతులు..! ఈసారి నేసింది చీర కాదు.. ఉరి..! బతుకుతెరువు అవుతుందనుకున్న మగ్గం భారంగా మారడంతో.. దానికే ఉరి వేసుకున్నాడు చేనేత కార్మికుడు కుళ్లాయప్ప(40). పెద్దవడుగూరు మండల కేంద్రానికి చెందిన కుళ్లాయప్పకు భార్య విజయలక్ష్మి, కుమారుడు ఉన్నారు. మగ్గంపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కానీ నేత వృత్తి ఆదాయానికి బదులు నెలనెలా అప్పులు మిగిల్చింది. ముడిసరుకుల ధరలు పెరగడం, పట్టుచీరలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. కుటుంబ అవసరాలు, ముడిసరుకుల కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. వాటితీర్చే మార్గం కానరాక తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. కుటుంబ పోషణ కూడా భారంగా మారింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చేనేత మగ్గానికి సోమవారం ఉరి వేసుకున్నాడు. భార్య, కుమారుడిని దిక్కులేనివారిని చేసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

\-పెద్దవడుగూరు

పెన్నహోబిలానికి ఉత్సవమూర్తులు

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ఉరవకొండ, మే 20: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి సోమవారం క్షేత్రానికి చేర్చారు. మొదట ఆమిద్యాలలోని పెన్నోబులేశుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ ఊరేగింపుగా పెన్నహోబిలానికి తీసుకువచ్చారు. ఈవో విజయ్‌కుమార్, ప్రధానార్చకుడు ద్వారకానాథాచార్యులు స్వామివార్లకు స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణంతో మంగళవారం అంకుర్పాణ చేయనున్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

వాహన సేవలు...

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ధ్వజారోహణం, ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. 22న సింహవాహనోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవం, 23న గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం, 24న హంసవాహనోత్సవం, 25న హనుమంత వాహనోత్సవం, 26న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 27న ఐరావత వాహనోత్సవం, 28న రథోత్సవం, 29న అశ్వవాహనోత్సవం, 30న ధ్వజావరోహణం, శయనోత్సవం నిర్వహిస్తారు. 31న ఉత్సవమూర్తులు పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు చేరుస్తారు. అంతటితో ఉత్సవాలు ముగుస్తాయి.

అనంత చరిత్రను భావితరాలకు అందించాలి

కలెక్టరు వినోద్ కుమార్



సమీక్షా సమావేశంలో కలెక్టరు వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న

అనంతపురం టౌన్, మే 20: జిల్లా చరిత్రను భావితరాలకు అందించడానికి ప్రత్యేకంగా పుస్తకాన్ని ముద్రించేలా చూడాలని పురావస్తుశాఖ అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, భవనాలు, స్థలాలను గుర్తించాలని, వాటి చరిత్ర గురించి ఆర్కియాలజీ, ఆసక్తి ఉన్న ఇంటాక్ సభ్యులు పరిశోధన జరపాలని సూచించారు. చారిత్రక ప్రాధాన్యాన్ని పుస్తక రూపంలో తీసుకువస్తే భావితరాలు తెలుసుకుంటాయని అన్నారు. ఇందుకోసం జిల్లా టూరిజం కౌన్సిల్‌ని ఏర్పాటు చేసి.. ఆర్కియాలజీ, ఇంటాక్ సభ్యులు ఒక బృందంగా పనిచేయాలని సూచించారు. జిల్లాకు పేరు తెచ్చేందుకు అందరూ కలిసి పనిచేయాలని, జిల్లా సంస్కృతిని పరిరక్షించుకోవాలని సూచించారు. ఇందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, ఇంటాక్ కో కన్వీనర్ చంద్రహాస్‌రెడ్డి, లైఫ్ మెంబరు డాక్టర్ రమేష్‌నారాయణ పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, మే 20: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేల ధరకు అమ్ముడుపోయాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 895 టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

ధర్మవరం గాయనికి గ్లోబల్ ఐకాన్ అవార్డు



సోమిశెట్టి సరళకు అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

ధర్మవరంరూరల్, మే20: ధర్మవరం పట్టణానికి చెందిన గాయని సోమిశెట్టి సరళ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. హైదారాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పలువురికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో సోమిశెట్టి సరళ కూడా ఉన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్రుతేజావత్, ఐఆర్‌సీఎస్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే పద్మారావు, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్, మంజునాథ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంజులాగౌడ్ చేతులమీదుగా సరళ అవార్డు అందుకున్నారు.

జోరుగా... ముంగారు సేద్యం..!

ఈసారి తొలకరి ముందే పలకరించింది.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గత సంవత్సరం వర్షం ఎప్పుడు వచ్చిందో.. ఎప్పుడు పోయిందో తెలియకుండానే గడిచిపోయింది. ఈ ఏడాది మంచి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులకు ఆశలు చిగురించాయి. మే నెలలో ముంగార్ల సేద్యాలు చేసుకుని జూన్‌లో పడే వర్షాలకే విత్తనం వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు.



పొలంలో వేసిన ఎరువు

- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ట్రాక్టర్ సేద్యానికి డిమాండ్
- ఖరీఫ్ సాగుకు రైతాంగం సమాయత్తం

అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్, మే 20: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ముంగార్ల సేద్యాలు మొదలయ్యాయి. కొన్నిరోజులుగా జిల్లాలో వర్షాలు పడుతుండటంతో దుక్కులు చేసుకోవడంపై రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం నాలుగు లక్షల హెక్టార్లు. ప్రతి ఏడాది 3.50 లక్షల హెక్టార్లకుపైగా పంటలు సాగవుతున్నాయి. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ మొదలుకానుంది. సకాలంలో వర్షాలు పడితే విత్తనం వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన స్థాయిలో వానలు పడితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ట్రాక్టర్లకు డిమాండ్..!

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడడంతో వేసవి దుక్కులకు డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ ద్వారా ఐదు మడకలు, రెండు మడకలు, ఒక మడక, టిల్లర్‌తో పొలాల్లో దుక్కులు చేసుకుంటున్నారు. ప్రాంతాల వారీగా భూమి స్వభావాన్ని బట్టి బాడుగలు నిర్ణయించారు. కొన్ని ప్రాంతాల్లో రెండు మడకలు, మూడు మడకలు, ఐదు మడకలతో దుక్కి చేసేందుకు గంటకు రూ.1000 నుంచి రూ.1100, ఏడు మడకలకు గంటకు రూ.1200 వసూలు చేస్తున్నారు. ఏడు మడకలకు ఎకరాకు రూ.600 నుంచి రూ.700 నిర్ణయించారు. డోజర్ ట్రాక్టర్‌తో గంటకు రూ.1000 నుంచి రూ.1100 వసూలు చేస్తున్నారు. టిల్లరుకు ఎకరాకు రూ.800 తీసుకుంటున్నారు. కాడెద్దులతో చెక్కల గుంటకతో దుక్కి చేసేందుకు ఎకరాకు రూ.500 తీసుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేసేందుకు గంటకు రూ.100కుపైగా బాడుగ పెరిగింది. ఒక గంటకు ఒకటిన్నర నుంచి రెండెకరాల్లో దుక్కులు పూర్తి చేస్తున్నారు. డీజిల్ ధర పెరడంతో బాడుగలు పెంచేశారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగు గంటలకు ఐదెకరాల్లో దుక్కులు చేసేలా ట్రాక్టర్ యజమానులు రైతులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.



గుత్తి రూరల్ మండలంలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

వేసవి దుక్కులతో ప్రయోజనాలివీ..!

వేసవి దుక్కులు చేయడం ద్వారా భూమి, పంటలకు చాలా ఉపయోగకరం. ఎక్కువ శాతం మంది రబీ పంటలు కోయగానే పొలాన్ని అలాగే వదిలేస్తారు. తొలకరి వర్షాలు పడిన సమయంలో ఖరీఫ్‌కు సన్నద్ధమవుతారు. అంతకంటే ముందు వేసవిలోనే దుక్కులు దున్నుకుంటే ప్రయోజనం ఉంటుంది. భూమి లోపల పొరల్లో దాగి ఉండే కీటకాలు గుడ్లు, శిలీంద్రాలు వేసవి దుక్కులు చేయడం ద్వారా బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి. దుక్కుల ద్వారా భూమిలో కోశస్థ దశలోని పురుగులు నేలపైభాగానికి రావడంతో పొలాలపై తిరిగి కాకులు, కొంగలు, వివిధ రకాల పక్షులు వాటిని తినేస్తాయి. పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలు, చెత్తాచెదారం లోతు దుక్కులు చేయడంతో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ పదార్థంగా మారి పంటలకు బలాన్నిస్తాయి. కలుపు మొక్కలు చనిపోతాయి. వేసవి దుక్కులతో గట్టిగా ఉండే భూమి గుల్లబారుతుంది. తద్వారా వర్షం పడిన సమయంలో భూమిలోకి నీరుచొచ్చుకొని పోయే స్వభావం, నీటి ని నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. విత్తనం విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. భూమిని దున్నడం ద్వారా భూమి పొరల్లోకి గాలి బాగా చేరుతుంది. తద్వారా సూక్ష జీవుల సాంద్రత పెరిగి, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. తద్వారా భూమిలోని పోషకాలను మొక్క గ్రహించేందుకు అనుకూలంగా ఉంటుంది. వేసవిలో భూమిని దున్నేటప్పుడు వాలుకు అడ్డంగా దున్నాలి. తద్వారా గాలి, వర్షం నీటి ద్వారా భూమి కోతకు గురికాకుండా ఎక్కడ పడిన వర్షపు నీరు అక్కడే పడి ఇంకిపోతుంది.

బాడుగలు పెరిగాయి



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వర్షం రావడంతో వేసవి దుక్కులు చేసుకున్నా. గతేడాదితో పోలిస్తే ట్రాక్టర్‌తో దుక్కులకు బాడుగ పెరిగింది. డీజిల్ ధర పెరగడంతోనే ధరలు పెంచారు. వేసవి దుక్కులు తప్పని సరికావడంతో ఖర్చుకు వెనుకాడలేదు. మరో సారి పదును వర్షం పడితే విత్తనం వేసేస్తాం.

\- రాముడు, రైతు, బేతాపల్లి, గుత్తి మండలం

పొలాన్ని సిద్ధం చేస్తున్నా..



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్ సీజన్‌కు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నా. వర్షం పడటంతో పొలంలో దుక్కి చేయించా. పొలంలో సేంద్రియ ఎరువు చల్లుకుంటున్నా. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత అదునులో వర్షం పడితే దేవుడిపై భారం వేసి వేరుశనగ విత్తనం వేస్తా.

\-శివ, రైతు, కొత్తపేట, గుత్తి మండలం

వేసవి దుక్కులు చాలా ముఖ్యం



వేసవి దుక్కులు చేసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడంతోపాటు భూమిలో ఉండే నీటిని, పోషక పదార్థాన్ని గ్రహిస్తాయి. దీంతో భూమి లోపలి పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. తద్వారా భూసారం తగ్గడంతోపాటు సాగు చేసిన పంటలకు అవసరమైన పోషకాలు లభించవు. అలాగే ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం కష్టమవుతుంది. గత కొన్ని రోజులుగా కురిసే వర్షాలను ఉపయోగించుకొని భూమిని 2 నుంచి 3 అడుగుల లోతు దుక్కి చేసుకుంటే మంచి ఫలితాలొస్తాయి.

\- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఏలికలారా..! పట్టించుకోండి..!

- కణేకల్లు చెరువులో పేరుకుపోతున్న పూడిక
- ఏటేటా తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

కణేకల్లు, మే 20: రాయలసీమలోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు వెళ్లే తుంగభద్ర నీటికి రిజర్వాయర్‌గా ఉపయోగపడుతున్న కణేకల్లు చెరువులో పూడిక పెరిగిపోతోంది. ఏటేటా పెరుగుతున్న పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో పూడిక తీసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెరువులోకి నీరు వస్తే ఏ ప్రాంతంలో ఎప్పుడు గండ్లు పడతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

2500 ఎకరాల్లో చెరువు నిర్మాణం



చెరువులో పేరుకుపోయిన పూడిక

శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలంలో శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ అనే సంస్థానాధీశుడు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును నిర్మించినట్లు పెద్దలు చెబుతారు. చెరువు నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేసిన చిక్కణ్ణేశ్వరుడికి ఆలయాన్ని నిర్మించి ఆయన్ను దేవుడిగా ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ కొలుస్తున్నారు. 0.5 టీఎంసీల సామర్థ్యం గల చెరువులో పూడిక పెరిగిపోవడంతో 0.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటోంది.

బలహీనంగా చెరువు గట్లు

వందల సంవత్సరాల కిందట పటిష్ఠంగా నిర్మించిన చిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు గట్లు ప్రస్తుతం బలహీనంగా మారాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా దాదాపు 2500-3000 క్యూసెక్కుల మేర నీరు ఒక్కసారిగా చెరువులోకి చేరుతోంది. ఆ ఉధృతిని తట్టుకోలేక పలుమార్లు చెరువుకు గండ్లు పడ్డాయి. ఇటీవల చెరువు కల్వర్టు కూడా కుప్పకూలిన విషయం తెలిసిందే. పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెరువు పరిస్థితి నానాటికి తీసుకట్టుగా మారుతోంది.

ఆక్రమణలో చెరువు భూములు

ఒకప్పుడు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు స్వార్థపరుల ఆక్రమణల వల్ల ప్రస్తుతం రెండువేల ఎకరాలకు తగ్గిపోయింది. కొత్తపల్లి, ఆదిగానిపల్లి, కణేకల్లు పరిసరాలలో చెరువు భూములను ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. దీనిపై హెచ్చెల్సీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భవిష్యత్‌లో చెరువు ఇంకెంత ఆక్రమణకు గురవుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు

రెండు పంటలు పండించుకునేవాళ్లం



శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు కిందే మా భూములు ఉన్నాయి. దాదాపు ఆరునెలల పాటు చెరువులో నీటి నిల్వ ఉండేది. దీంతో మేము ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా వరి పంట పండించుకునేవాళ్లం. ప్రస్తుతం చెరువులో పూడిక వల్ల కేవలం ఖరీఫ్‌లో మాత్రమే పంటలు పండించుకుంటున్నాం.

\- కుద్దూస్, రైతు, కణేకల్లు

టీడీపీ హయాంలో రూ.రెండు కోట్లతో పూడికతీత

కణేకల్లు చెరువులో పేరుకుపోయిన మట్టి గురించి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పూడికతీత కోసం రూ.రెండు కోట్ల నిధులు విడుదల చేయించారు. పూడిక తీయడంతో అప్పట్లో చెరువులో నీటి సామర్థ్యం పెరిగింది. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువు గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో పూడిక యథాప్రకారం పెరిగిపోయింది. అధికారులు శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువుపై దృష్టి పెట్టి పూడికతీయించాలని రైతులు కోరుతున్నారు.

తీవ్ర నిర్లక్ష్యం



ఐదేళ్ల వైసీపీ పాలనలో కణేకల్లు చెరువు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. రూపాయి కూడా మరమ్మతుల కోసం వినియోగించలేదు. ఎంతో చరిత్ర గలిగిన చిక్కణ్ణేశ్వర చెరువుపై నిర్లక్ష్యం పాలకులకు పనికిరాదు. రాబోయే ప్రభుత్వాలు చెరువు గురించి పట్టించుకుని మరమ్మతులు చేయించాలి.

\- వేలూరు మరియప్ప, చెరువు సంఘం మాజీ అధ్యక్షుడు

కర్ణాటక కిక్కు @ రూ.100 కోట్లు..!



- ఓటర్లను మద్యం మత్తులో దింపిన అభ్యర్థులు
- పోలింగ్ రోజు రూ.వందకోట్ల మద్యం హాంఫట్
- రెండు నెలలు ఏరులై పారిన పొరుగు మద్యం

హిందూపురం, మే 20: ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ఆయా పార్టీల అభ్యర్థులు మద్యం మత్తులో ముంచెత్తారు. రెండు నెలలపాటు తాగేవారికి తాగినంత అనేలా మత్తులో దింపారు. ఈసారి కర్ణాటక మద్యంశ్రీసత్యసాయి జిల్లాలో ఏరులై పారిందని చెప్పవచ్చు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు గుర్తుకు రాకూడదనే ఉద్దేశంతో ఆ పార్టీ ముఖ్యనేతలు ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు మత్తులో దించారు. మద్యం వ్యాపారాలు సైతం ప్రభుత్వమే నిర్వహించింది. 2019 ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం పూర్తిగా అమలుచేసి, 2024లో ఓటు అడుగుతానని వైసీపీ అధినేత జగన్ హామీ ఇచ్చాడు. దానిని అమలు చేయకపోగా.. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పక్కరాష్ట్రం మందుతో నిషా ఎక్కించారు. జిల్లావ్యాప్తంగా రెండు నెలలపాటు సుమారు వంద కోట్ల మద్యం తాగేసినట్లు అంచనా.

ఓటర్లకి కిక్కే.. కిక్కు..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ప్పటి నుంచి పోలింగ్ ముగిసే సమయానికి సుమారు రెండునెలల వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో బరిలో ఉంటామనుకున్న అభ్యర్థులు ప్రచారంలోకి వెళ్లారు. ఒక్కో పార్టీ ఒక్కో కార్యక్రమంతో ప్రచారం చేపట్టింది. అప్పటి నుంచే తమవెంట తిప్పుకునేందుకు మద్యం అందజేశారు. నామినేషన్ నుంచి పోలింగ్ రోజు వరకు రెట్టింపు స్థాయిలో ఓటర్లకు మద్యం అందించారు. ర్యాలీలు చేసినా, గ్రామాల్లో ప్రచారం నిర్వహించినా, రాష్ట్ర నేతలు ప్రచారాలకు వచ్చినా మద్యం అందించారు. ఎన్నడూలేనివిధంగా ఈసారి మద్యం అధికంగా విక్రయాలు సాగినట్లు సమాచారం. ఓటర్లను 56 రోజులపాటు ఆయాపార్టీల అభ్యర్థులు మద్యం, డబ్బులిస్తూ తిప్పుకున్నారు.

తెగ తాగేశారు..

నోటిఫికేషన్ వెలువడినప్పట్నుంచి ఈనెల 13 పోలింగ్‌రోజు వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.వందకోట్లకుపైగా విలువైన మద్యాన్ని ఓటర్లకు అందజేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతి నియోజకవర్గం నుంచి ఆయాపార్టీల అభ్యర్థులు రూ.10కోట్లకుపైగా మద్యానికే ఖర్చు చేసినట్లు అంచనా. కొన్ని నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు కలిసి రూ.15 కోట్లు మద్యానికే ఖర్చు చేసినట్లు లెక్కలు వేస్తున్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో కలిపి రూ.వందకోట్లకుపైగానే మద్యం తాగేసినట్లు అంచనా. ఏపీ మద్యం ఇంతపెద్దఎత్తున ఓటర్లకు ఇచ్చి ఉండుంటే రెండింతల బిల్లు అయిఉండేదని ఒక అధికార పార్టీకి చెందిన నాయకుడే చెప్పడం గమనార్హం. ఎందుకంటే కర్ణాటకలో మద్యం ధరలు తక్కువ. ఇక్కడైతే రెండింతలు అధికం. కర్ణాటక మద్యం వచ్చింది కాబట్టి, కొంత ఖర్చు తగ్గించుకోగలిగామని అభ్యర్థులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)

పోలింగ్‌రోజు ఏరులై పారింది..

ఈనెల 13న ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రూ.10కోట్లకు పైగా మద్యం సేవించినట్లు ఓ అంచనా. ప్రతి పంచాయతీకి రూ.లక్షకు తగ్గకుండా మద్యం అందించినట్లు సమాచారం. ఒక పార్టీనే ఇంత ఇచ్చి ఉండుంటే ఇక అన్ని పార్టీలు కలిసి ఏ స్థాయిలో సరఫరా చేశాయో అర్థం చేసుకోవచ్చు. ఈనెల 12, 13 తేదీల్లో కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం షాపుల నుంచి భారీఎత్తున జిల్లాలోకి మద్యాన్ని తీసుకొచ్చారు. సరిహద్దుల్లో అన్నిచోట్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా కొంతమంది అభ్యర్థులు ముందస్తుగానే ఆయా నియోజకవర్గాల్లో డంప్ చేసుకున్నారు. మరికొంతమందైతే కర్ణాటక వారికే డెలివరీ చేసే బాధ్యత అప్పగించారు. ఏదిఏమైనా ఏపీ ఎన్నికలు కర్ణాటక సరిహద్దులో ఉన్న మద్యం షాపులకు కాసుల వర్షం కురిపించిందనడంలో సందేహం లేదు.

నాణ్యమైన విత్తన కాయలను సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న జేడీఏ

అనంతపురం అర్బన్, మే 20: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేయాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఏడీఏ రవి, ఏఓ శశికళతో కలిసి ఆమె అనంతపురంలోని హిమబిందు, కృష్ణ ట్రేడర్స్, విజయ ఆగ్రో ఏజెన్సీస్, నందీశ్వర ఏజెన్సీ, విజిట్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సోమవారం తనిఖీ చేశారు. ప్రాసెసింగ్ తీరును, రికార్డులు, విత్తన మొలక శాతాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ చేయాలని సూచించారు. ఆర్బీకేలకు కేవలం నాణ్యమైన విత్తన వేరుశనగ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

- జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం రెండో రోజు కొనసాగింది. ఇప్పటిదాకా 10,205 మంది రైతులు 9,077 క్వింటాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

కాలువల్లో పూడిక తొలగించండి



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 20: నగరంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలకసంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రామిరెడ్డి మాట్లాడుతూ... రెండు సంవత్సరాల క్రితం అనంతపురం నగరంలో ఎన్నడూ లేని రీతిలో వరదలు రావడం, ఆ వరదల్లో కొన్ని వందల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడం జరిగిందన్నారు. దీనికి ప్రధానంగా నడిమివంక, మరువవంకలో పూడిక తీయకపోవడమేనని తెలిపారు. రానున్నది వర్షాకాలం కాబట్టి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పూడికను తీసేయాలని, తద్వారా వర్షాలు వచ్చినా ప్రజలకు నష్టం జరగకుండా ఉంటుందని అన్నారు. రిషిత స్కూల్ దగ్గర ఉన్న బ్రిడ్జి, కృష్ణ టాకీస్ వద్దనున్న బ్రిడ్జి, కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రి వద్దనున్న బ్రిడ్జిలలో చెత్త ఎక్కువగా పేరుకుపోయిందని, వీటిని వెంటనే బాగు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ త్వరలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి పూడికతీత పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు ప్రకాష్, మసూద్, జీవ, వెంకటేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లయినా..!

పూర్తి కాని అంగన్‌వాడీ భవన నిర్మాణం



శింగనమలలో ఆగిపోయిన మినీ అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం

శింగనమల మే 20: స్థానిక ఎస్సీ కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. ప్రజా ధనం దాదాపు రూ. మూడు లక్షలు నిరుపయోగంగా మారింది. నాలుగు సంవత్సరాల క్రితం ఈ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మొదటి దశ పనులు బాగా సాగినా.. రెండో దశ పనులు ఆగిపోయాయి. మొదటి దశలో చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ రెండో దశ పనులను నిలిపివేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. అటు పాలకులు.. ఇటు అధికారులు దీని గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఈ భవనం ప్రస్తుతం పలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది.





పార్కు, హౌసింగ్ బోర్డు ప్రధాన రహదారుల్లో రోడ్డు నిర్మాణ పనులు

ఆటవిడుపునకు తాళం..!

- రోడ్డు నిర్మాణం పేరుతో పార్కు మూసివేత
- ప్రత్యామ్నాయం చూపకుండా అధికారుల నిర్లక్ష్యం
- వేసవి సెలవుల్లో ఆటలకు దూరమైన పిల్లలు
- వాకింగ్‌కు అవకాశం లేక పలు కాలనీవాసుల ఇబ్బందులు





పార్కు గేటుకు తాళం వేసిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్ : రోడ్డు వేస్తున్నారనే సాకు తో హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కుకు ఏకం గా తాళం వేశారు నగర పాలక అధికారులు. కనీసం ఆ పార్కులోకి వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా.. అధికారులు పార్కు మూసివేశారు. నగరంలోనే అతి పెద్ద విశాలమైన ఉద్యానవనం ఇది. ఈ పార్కులో పిల్లలు నిత్యం ఆడుకుంటారు. ఇక స్థానికులు ఉదయం, సాయంత్రం వ్యాయం, నడక సాగిస్తూ ఉంటారు. వేసవి సెలవుల్లో పిల్లలు, పాద చారులు ఈ పార్కుకు ఎక్కువగా వస్తుంటారు. నగరంలోని కమలా నగర్, సాయినగర్, అశోక్‌నగర్, అరవింద్‌నగర్, బుడ్డప్పనగర్, పాతూరు, శరదానగర్, భైరవ నగర్ ప్రాంతాల పిల్లలు, పాదచారులు ఈపార్కుకే వస్తుం టారు. అలాంటిది సరిగ్గా ఈ వేసవి సెలవులు వదిలిన సమయంలో ఆ పార్కు ఎదుట సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఎటువంటి ప్రత్యామ్నాయ ప్రవేశమార్గాలూ చూపకుండా ఆ పార్కును అధికారులు మూసి వేసి... ఏకంగా తాళం వేశారు. దీనిపై పిల్లలు, పాదచారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికే దాదాపు 20 రోజులుగా ఈ పార్కును మూసేశారు. మరో 25 రోజులు అలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతలోపే వేసవి సెలవులు ముగియనున్నాయి. పార్కుకు ప్రత్యామ్నాయ ప్రవేశ మార్గాల ద్వారా అవకాశం కల్పించాలని పిల్లలు, పాదచారులు కోరుతున్నారు.



మరూరు నుంచి ధర్మవరం వెళ్లే దారిలో ఏర్పడ్డ భారీ గుంత

ఎటు చూసినా గుంతలే..!

మరూరు నుంచి ధర్మవరం రహదారి దుస్థితి



గుంతలమయమైన రోడ్డు

రాప్తాడు, మే 20: మండలంలోని మరూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి ధర్మవరం ప్రధాన రహదారి వరకూ ఉన్న 12 కిలో మీటర్ల తారు రోడ్డు గుంతల మయంగా ఉంది. దారి పొడవునా ఎక్కడ చూసినా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాప్తాడు మండలంలోని అనేక గ్రామాల నుంచి ధర్మవరానికి ఈ రోడ్డు మార్గం ద్వారానే వాహనదారులు ఎక్కువగా వెళ్తుంటారు. గుంతలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాల పడుతున్నారు. ఈ తారు రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

అనంతపురం అర్బన్, మే 20: ఎమ్మార్పీకే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని అనంతపురం ఏడీఏ రవి డీలర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని డీలర్లు అందరూ నిబంధనల మేరకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిం చాలన్నారు. గడువు తీరిన వాటిని విక్రయించరాదన్నారు. ఎవరు నిబంధనలు అతిక్రమించినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగరంలో నిలిచిన విద్యుత్ సరఫరా

అనంతపురం రూరల్, మే 20: నగరంలో సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో భారీ ఎత్తున గాలి, వాన రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రంగస్వామి నగర్, లక్ష్మినగర్, పాతవూరు తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయాయి. సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పడిపోయిన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరనకు అధికారులు చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా అనంతపురం నగరంతో పాటు అనంతపురంరూరల్ ప్రాంతాలు, బుక్కరాయసముద్రం, నార్పల, రాప్తాడు, శింగనమల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్ చేశారు.

భారీ వర్షం... అన్నదాతల హర్షం

రాప్తాడు, మే 20: మండలంలోని రాప్తాడు, రామినేపల్లి, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, బండమీదపల్లి, వరిమడుగు, గాండ్లపర్తి, కొత్తపల్లి, బుక్కచెర్ల, పాలచెర్ల, బోగినేపల్లి, మరూరు తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో చెక్‌డ్యాంలు, వంకలు నిండాయి. గతేడాది తీవ్ర వర్షాభావం వలన వ్యవసాయ బోర్లలో నీరు చాలా తగ్గాయి. వర్షాల వలన బోర్లలో కొంత వరకూ నీరు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షం కురువడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ, కంది ఇతర పంటలు సాగుకు సేద్యం పనులు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.



వర్షపు నీటితో నిండిన వరిమడుగు చెక్‌డ్యాం



కొత్తపల్లి చెక్‌డ్యాంలోకి చేరిన వర్షపు నీరు

పోస్టల్ బ్యాలెట్లు భద్రమేనా...?

శింగనమల, మే 20: శింగనమల నియోజకవర్గంలో దాదాపు 200 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగిం చుకున్నారు. రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన వాటిని తహసీల్దార్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. అయితే ఆ స్ట్రాంగ్ రూం వద్ద ఎలాంటి భద్రత సిబ్బంది లేదని, రాత్రి కేవలం వాచ్‌మన్ మాత్రమే ఉంటున్నాడని ఇటు వివిధ పార్టీ అభ్యర్థులు.. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్ట్రాంగ్ రూంకు భద్రత కల్పించాలని కోరుతున్నారు. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెలను వివరణ కోరగా శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్లను భద్రపరిచిన గది

తాగునీటి సమస్య పరిష్కరించండి

నార్పల : స్థానిక ఉద్దిబావి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం ఎంపీడీఓ రాముడుకు ఆ కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో నాలుగు రోజుల నుంచి నీరు రావటం లేదని, అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మంగళవారం నీరు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గంజికుంటరామకృష్ణ, రాధకృష్ణ, శ్రీనివాసులు, తిమ్మయ్య, గౌస్, లోకేష్ పాల్గొన్నారు.



ఎంపీడీఓతో మాట్లాడుతున్న కాలనీ వాసులు

ఏపీఎల్ ఫైనల్లో ఇండియన్ సిక్సర్స్ జట్టు

నేడు అనంత రైజింగ్ స్టార్స్‌తో టైటిల్ పోరు

అనంతపురం క్లాక్‌టవర్, మే 20: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీసీఎల్) సీజన్-2 పోటీల్లో ఇండియన్ సిక్సర్స్ జట్టు ఫైనల్‌కు చేరింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు సోమవారమూ కొనసాగాయి. క్వాలిఫైయర్-2 మ్యాచ్‌లో ఫ్యామిలీక్లబ్, ఇండియన్ సిక్సర్స్ జట్లు మధ్య జరగగా... ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 191 చేసింది. ఇందులో వీరారెడ్డి 67 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి ఫ్యామిలీ క్లబ్ జట్టు 19.1 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఇండియన్ సిక్సర్స్ జట్టు 89 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటికే ఫైనల్‌కు చేరిన అనంత రైజింగ్ స్టార్స్ జట్టుతో ఇండియన్ సిక్సర్స్ తుది పోరు మంగళవారం జరగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంజీప్లే మాజీ ప్లేయర్ కృష్ణకుమార్, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఇండియన్ సిక్సర్స్ జట్టు

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం టౌన్, మే 20: జేఎన్‌టీయూలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్, నూతన ఎస్పీ గౌతమిశాలీ సోమవారం పరిశీలించారు. జూన్ 4న కౌంటింగ్ ఏఏ నియోజకవర్గానివి.. ఎక్కెడెక్కడ చేపడుతున్నారు.. అక్కడ ఏ విధంగా ఏర్పాట్లు జరుగుతు న్నాయి.. తదితర వివరాలను కలెక్టరు ఎస్పీకి వివరించారు. కౌంటింగ్ రోజున ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు గురించి కలెక్టరు, ఎస్పీ ప్రత్యేకంగా చర్చించుకున్నారు. జేఎన్‌టీయూ వద్ద మూడంచెల భద్రత పక్కాగా కొనసాగించాలని అధికారులను వారు ఆదేశిం చారు. ప్రతి విషయంలోను ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ ముగిసే వరకు అందరు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. వారి వెంట నగరపాలక కమిషనర్ మేఘస్వరూఫ్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, పలువురు ఆర్‌ఓలు, నోడల్ అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.



భద్రతాఏర్పాట్లను కలెక్టరుకు వివరిస్తున్న ఎస్పీ

జడిసిన అనంత

అనంతపురం అర్బన్, మే 20 : నగరంలో సోమవారం రాత్రి నగరవాసులు జడిసేలా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగరంలో భారీ వర్షంతో పలు కాలనీలు ఎప్పటిలాగే జలమయం అయ్యాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరా అధికారులు నిలిపివేయడంతో నగరం అంధకారంలో ఉండిపోయింది. ఓ వైపు భారీ వాన... ఉరుములు... మరో వైపు చీకట్లతో ప్రజలు హడలిపోయారు. భారీ వృక్షాలు.. విద్యుత్ స్థంబాలు నేలకూలాయి. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలోకి భారీ ఎత్తున వర్షపు నీరు చేరింది.







అనంతపురంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన గుల్జార్ పేట్, రామ్‌నగర్‌లోని ప్రాంతాలు

గగన్‌దీప్ సింగ్ హంతకులను శిక్షించాలి



గగన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 20: రాజస్థాన్ రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గగన్‌దీప్ సింగ్‌ను హత్య చేసిన హంతకులను వెంటనే శిక్షించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో గగన్ చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఇతర జిల్లా నాయకుల నివాళులర్పించారు. గగన్‌ను ఈనెల 1న గంగానగర్‌లో అనుమానాస్పద వ్యక్తులు హత్యాయత్నం చేశారని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆయనకు వైద్య చికిత్సలు అందించినా.. కోలుకోలేక ఈనెల 15న మరణించారని అన్నారు. స్థానిక పోలీసులు ఈ కేసులను ప్రమాదంగా పరిగణించడం చూస్తుంటే.. దీని వెనుక కుట్ర ఉందని స్పష్టమవుతోందన్నారు. పోస్టుమార్టం రిపోర్టులో సైతం ఆయన తల, శరీరంపైన బలమైన గాయాలు ఉన్నట్లు తేలిందన్నారు. ఆయన హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు మంజు నాథ్, ఉమామహేష్, వంశీ, ఆనంద్ సమీర్, యుగంధర్, ఇలియాజ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్


ఇసుక రీచ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపప్పూరు, మే20: సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు మండలకేంద్రం సమీపంలో ఉన్న పెన్నానదిలోని ఇసుకరీచ్‌ను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఇసుక తరలింపు, నాణ్యత, పరిమాణం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూగర్భజలాలు ఎంతమేర అడుగంటాయో ఆరాతీశారు. అనంతరం ఇసుకను తరలించిన పలు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లో ఎలాంటి అక్రమ తవ్వకాలు చేయరాదన్నారు. రాత్రి సమయాల్లో కూడా పోలీసులు చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమతవ్వకాలు చేస్తే జరిమానాలు విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన వెంట మైన్స్ డీడీ నాగయ్య, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరాం, అధికారులు తిప్పేస్వామి, కిషోర్‌రెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్, ఏఎస్‌ఐ మహదేవ్, ఆర్ఐ రామాంజులురెడ్డి ఉన్నారు.

వేదవతి హగరి ఇసుకరీచ్‌ను పరిశీలించిన ఆర్డీఓ


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణిసుస్మిత

రాయదుర్గంరూరల్, మే 20: మండలంలోని వేపరాల గ్రామం వద్ద వేదవతి హగరిలోని ఇసుకరీచ్‌ను ఆర్డీఓ రాణిసుస్మిత పరిశీలించారు. సోమవారం సాయంత్రం ఆర్డీఓ రాణిసుస్మిత, మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక రీచ్ వద్దకు చేరుకొని పరిశీలించారు. ఇసుక రీచ్‌లో ఎంత పరిమాణంలో ఇసుక తవ్వారు అనే అంశాన్ని సేకరించి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ అల్లాబకాష్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేసులతో నాయకుల్లో వణుకు

పుట్లూరు, మే20: తాడిపత్రి రాళ్లదాడి కేసు విషయంలో మండలానికి చెందిన పలువురు టీడీపీ, వైసీపీ నాయకులకు భయం పట్టుకుంది. దాడిలో పాల్గొన్న నాయకులు ఎప్పుడు వచ్చి పోలీసులు అరెస్ట్ చేస్తారోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు దాడిలో పాల్గొన్న వారి జాబితా మండలానికి పంపి గుర్తించాలని ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే చాలామంది నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. మరికొంతమంది నాయకులు కుటుంబాలతో కలిసి విహార యాత్రలకు వెళ్లారు. మండలంలో ఇరుపార్టీలకు చెందిన సుమారు 28మంది నాయకులు కేసులో నిందితులుగా ఉన్నట్లు సమాచారం. కేసుకు సంబంధించి ఇరుపార్టీలకు చెందిన నాయకులను సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సుజాత

కుందుర్పి, మే 20: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సుజాత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది మరింత అంకిత భావంతో రోగులకు సేవలందించాలని, వైద్యశాల పర్యావరణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆమె వెంట జిల్లా డీపీఎంవో అధికారి డాక్టర్ రవి శంకర్, డాక్టర్ చాంద్ బేగమ్, డాక్టర్ అనూష, డాక్టర్ నారాయణ స్వామి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, మే 20: మండలంలోని మల్లిపల్లిలో చిత్రక్క (35) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు చిత్రక్క భర్త ఈరన్న తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. దీంతో చిత్రక్క తీవ్ర మానసిక ఆవేదనతో ఉండేది. ఈక్రమంలోనే ఆమె మనస్తాపం చెంది తన చిన్న కొడుకు దర్శన్‌ను దుకాణానికి పంపి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపులు మూసి ఉండటంతో కిటికీలో నుంచి లోపలికి తొంగి చూశాడు. ఫ్యాన్‌కు వేలాడుతున్న చిత్రక్కను గమనించి తలుపులు పగులగొట్టి ఆమెను కిందికి దించాడు. అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. స్థానికుల సమాచారంతో కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కలశార్చన

గుంతకల్లుటౌన్, మే 20: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం కలశార్చన నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టుకు పుష్పాలంకరణచేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని బంగారు అక్షయ పాత్రతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో భారీగా పోలీసు బలగాలు

● మాక్‌డ్రిల్, కవాతు నిర్వహించిన పోలీసులు


కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

తాడిపత్రి టౌన్, మే 20: పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, నరసింగప్ప, శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కవాతు, మాక్‌డ్రిల్ నిర్వహించారు. పట్టణంలోని అశోక్‌పిల్లర్, చిన్నబజారు, బండామసీదు, కటికవీధి, సుంకులమ్మపాలెం, యల్లనూరురోడ్డుసర్కిల్, పుట్లూరురోడ్డు సర్కిల్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు కవాతు సాగింది. పట్టణ శివార్లలో చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. కవాతులో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఏపీఎస్పీ బలగాలు, ఏఆర్ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ముంగారు సేద్యంలో అన్నదాతల బిజీ బిజీ

పొలాలు దున్నుతూ... ఎరువులు వేస్తున్న రైతులు

రాయదుర్గం రూరల్, మే 20: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ముంగారు సేద్యానికి రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే కురిసిన పదును వానకు పొలాలను దుక్కులు చేసుకోవడం, ఎరువులు తరలించడంలోనూ రైతులు నిమగ్నమయ్యారు. వేరుశనగ సాగు చేసేందుకు పొలాలను ట్రాక్టర్లతోనూ, ఎద్దులతోనూ దున్నిస్తున్నారు. రాయదుర్గం మండలంలో 17 వేల హెక్టార్లలో వివిధ పంటలను ఈ సీజన్‌లో సాగు చేస్తారు. ఇందులో 14,560 హెక్టార్లలో వేరుశనగ సాగు చేయనున్నట్లు సమచారం. మిగిలిన విస్తీర్ణంలో ఆముదం, కంది, పత్తి, ఉలువ, అలసంది, సజ్జ తదితర పంటలు సాగు చేయనున్నారు.


పొలానికి తీసుకెళ్లేందుకు బండికి ఎరువును నింపుతున్న రైతులు


పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం పనులు చేస్తున్న రైతులు

వేసవి దుక్కులతో అధిక ప్రయోజనాలు

వేసవిలో దుక్కులు చేసుకుంటే భూమిలోని వేడి బయటకు వెళ్లిపోతుంది. అలాగే లోపలి పొరల్లో ఉన్న పంటకు హాని చేసే తెగుళ్లు, క్రిమికీటకాలు బయట పడి చనిపోతాయి. కలుపు మొక్కలు పెరగకుండా ఉంటాయి. భూమి పొరలు మెత్తగా ఉండటంతో వర్షం కురిసిన వెంటనే నీరు నేలలోకి వెళ్లిపోయి, తేమను నిల్వ ఉంచుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. దీంతో మొక్కలు ఏపుగా పెరగడానికి సరిపడా నీటి సాంద్రత లభ్యమవుతుంది. అందుకే విత్తన సాగు చేపట్టే ముందు నేలను రెండు మూడుసార్లు దుక్కులు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

శ్రీరామిరెడ్డి వర్కర్లకు వెంటనే జీతాలివ్వాలి: ఓబులు

కణేకల్లు, మే 20: శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీంలో పనిచేస్తున్న వర్కర్స్‌కు వెంటనే జీతాలను అందించాలని సీపీఎం నాయకుడు ఓబులు డిమాండ్ చేశారు. వర్కర్స్‌తో కలిసి ఆయన సోమవారం జిల్లా కేంద్రంలో అధికారులను కలిశారు. ఆయన మాట్లాడుతూ ఫేజ్ ఫోర్ కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్‌లలో దాదాపు 190 మంది కార్మికులు పనిచేస్తుండగా వారికి మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అధికారపార్టీకి అనుకూలంగా లేరనే ఉద్దేశ్యంతో 21 మంది కార్మికులపై కూడా సంబంధిత కాంట్రాక్టర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. స్కీం ప్రారంభమైనప్పటి నుంచి ఇందులో పనిచేస్తున్న కార్మికులకు 14 సంవత్స రాలకు సంబంధించిన పీఎఫ్‌లు కూడా బకాయి పడ్డారన్నారు. వీటన్నింటిని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, రాము, వన్నూరుస్వామి పాల్గొన్నారు.


జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఓబులు తదితరులు

బాల్య వివాహాలను నివారించాలి


బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వనజ అక్కమ్మ

కుందుర్పి, మే 20: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కంబదూరు ఐసీడీఎస్ అధికారిణి వనజ అక్కమ్మ సోమవారం పేర్కొన్నారు. మండలంలోని జంబుగుంపల గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో చేపట్టిన బాల్య వివాహాలను అరికడదాం- ఆడ బిడ్డలను కాపాడుదాం అన్న కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్న వయసులో వివాహాలు చేస్తే జరిగే అనర్థాల గురించి వివరించారు. బాల్యవివాహాలు చేసిన వారు, అందుకు సహకరించిన వారు కూడా శిక్షార్హులేనన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే 1098, 100, 112 నంబర్లకు సమాచారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పోలీసులు అక్కులన్న, బొమ్మన్న, ఆర్డీటీ సీవో రామాంజనేయులు, వైద్య సిబ్బంది స్వప్న, అనిత, తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు తాగునీటి కోసం అవస్థలు


కల్యం గ్రామంలో మూతపడ్డ నీటి ప్లాంట్

డీ.హీరేహాళ్, మే 20: గుక్కెడు తాగునీటి కోసం గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి గ్రామాల లో రూ. 5లకే 20 లీటర్లు అందించింది. ప్రతి గ్రామపంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. నిర్వహణ కూడా సక్రమంగా జరిగింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే వీటిపై నిర్లక్ష్యం చూపింది. దీంతో మండలంలో 80 శాతంపైగా మినరల్ వాటర్‌ప్లాంట్లు మూతపడ్డాయి. కల్యం, పులకుర్తి, మల్లికేతి, హిర్దేహాళ్, జాజరకల్లు, కాదలూరు తదితర గ్రామాలలో మంచినీటి ప్లాంట్లను పూర్తిగా మూసి వేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం పక్క గ్రామాలకు నీటి కోసం క్యూ కడుతున్నారు.

విత్తన వేరుశనగ పంపిణీకి చర్యలు

బెళుగుప్ప, మే 20: మండలంలో ఖరీఫ్ రైతులకు 1800 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ తెలిపారు. విత్తనం అవసరమున్న రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

జూదరుల అరెస్టు

బెళుగుప్ప, మే 20: మండలంలోని శీర్పి గ్రామ శివార్లలో సోమవారం పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఏడుగురిని పట్టుకుని వారి నుండి రూ. 1200లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మరిమాకులపల్లి పరిసరాల్లో...

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం మరిమాకులపల్లి పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరంపై ఎస్ఐ ఆంజనేయులు తమ సిబ్బందితో సోమవారం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 55,120, ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ వారందరిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆధార్‌కు గెజిటెడ్ సంతకం ఉంటే చాలు...

బొమ్మనహాళ్, మే 20: గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే చాలు ఆధార్‌కార్డు తీసుకోవచ్చని తహసీల్దార్ రామాంజనమ్మ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మీసేవ సెంటర్‌లలో ఆధార్‌కార్డు తీసేందుకు తహసీల్దార్ సంతకమే ఉండాలని లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. ప్రస్తుతం ఆధార్‌కార్డులో అడ్రస్‌మార్పులు, మొబైల్ నెంబర్ లింక్, ఎలాంటి తప్పు ఒప్పులు ఉన్నా గెజిటెడ్ అధికారుల సంతకాలతో ఆధార్ అప్లికేషన్ తీసుకొని తియ్యాలన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

ఉరవకొండ, మే 20: మండలంలోని ఆమిద్యాల, రాకెట్ల గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలను ఏవో శుభకర్ తనిఖీ చేశారు. రాయితీ వేరుశనగ విత్తన కాయలను పరిశీలించారు. ఆమిద్యాల గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు.

నేడు నరసింహ జయంతి

రాయదుర్గంరూరల్, మే 20: మండలంలోని మల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలో వెలసిన విప్రమలై నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామివారికి లక్ష తులసి అర్చన, సాయంకాలం 5 గంటలకు జయంత్యుత్సవం నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్వామివారికి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

రేపు మండల సమావేశం

రాయదుర్గంరూరల్, మే 20: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగునీరు తాగాలా?

- తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం
- తాగునీటి కొళాయిలకు కలుషిత నీరు సరఫరా
- పైప్‌లైన్ కోసం తెచ్చిన పైపులు వెనక్కి పంపిన వైనం
- గుంతకల్లు ఫక్కీరప్ప కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య

గుంతకల్లుటౌన్, మే 20: పట్టణంలోని ఫక్కీరప్ప కాలనీలో తాగునీటి కొళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని ఆ కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట ఆ వార్డు కౌన్సిలర్ దగ్గర ఉండి తాగునీటి పైప్‌లైన్ కోసం దాదాపు 400 మీటర్ల మేర గుంతను తవ్వించారు. అయితే రెండు రోజులకే ఎన్నికల కోడ్ పేరుతో పైప్‌లను మున్సిపల్ అధికారులు వెనక్కి తీసుకెళ్లారు. తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్వినగుంత మూసివేతకు మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిపై కాలనీ ప్రజలు ఆ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు మండిపడ్డారు. రెండేళ్ల నుంచి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ వల్ల కొళాయిలకు కలుషిత నీరు వస్తోందని మహిళలు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కలుషిత నీరు ఎలా తాగాలని వారు మండిపడ్డారు. తాగునీటి పైపులు ఏర్పాటు చేయాలని లేకపోతే మంగళవారం పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని కాలనీ ప్రజలు తెలిపారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీ మహిళలు


కాలనీలో తాగునీటి పైప్‌పైన్ కోసం ఏర్పాటు చేసిన గుంత

రోగాల బారిన పడితే పట్టించుకునేదెవరు?



తాగునీటి కొళాయిలకు వస్తున్న నీరు దుర్వాసనగా ఉంటోంది. దీనిపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పిన పట్టించుకోవడంలేదు. కలుషిత నీరు తాగి, రోగాల బారిన పడితే పట్టించుకునేది ఎవరు.
- రసూల్‌బీ, ఫక్కీరప్ప కాలనీ

రోగాలు కొని తెచ్చుకోవాల్సిందే



ఆరు రోజులకొకసారి కొళాయిలకు నీరు వస్తుంది. అది కూడా దుర్వాసన వస్తోంది. ఆ నీటిని తాగితే రోగాలు కొనితెచ్చుకోవాల్సిందే. డబ్బులు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.
- సత్యనారాయణ, ఫక్కీరప్ప కాలనీ.

బుగ్గరామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



తాడిపత్రిటౌన్, మే20: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేసి వెండికవచాలు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఓపీఎస్ కోసం అలుపెరగని పోరాటం

ఆలిండియా ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయిస్ యూనియన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ యూ ఖడ్సే

గుంతకల్లు, మే20: కేంద్ర ప్రభుత్వం ఓపీఎస్(పాత పించను విధానాన్ని)ను పునరుద్ధరించేదాకా పోరాటాన్ని ఆపరాదని ఆలిండియా ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సంఘ ద్వైవార్షిక సర్కిల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ సంఘ నాయకులు మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కొత్త పించను రద్దు, పాత పించను విధానం పునరుద్ధరించడానికి అలుపెరుగని పోరాటాలు సాగించాలన్నారు. గుంతకల్లు డివిజన్ హెడ్ క్వార్టర్సులోని రైల్వే మెయిల్ సర్వీస్ ప్రాధాన్యతను తగ్గించే కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ఉద్యోగులు సమష్టిగా వీటిపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్-3 ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యూ ఖడ్సే ఆర్-4 ప్రధాన కార్యదర్శి కే ముక్తార్ అహ్మద్, ఆర్-3 సర్కిల్ అధ్యక్షుడు పీవీ రావు, కార్యదర్శి మృదుల, నాయకులు సురేశ్, బి. రామాంజనేయులు, మధుసూదనరావు, కోటేశ్వరరావు, పి. శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

అమిలినేని కోసం ఉడుపిలో పూజలు


దేవాలయం ఎదుట అమిలినేని బ్యానర్ చేతపట్టుకున్న నాయకులు

కళ్యాణదుర్గం, మే 20: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు భారీ మెజార్టీతో గెలుపొందాలని ఉడుపిలో సోమవారం పూజలు చేసినట్లు కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు తెలిపారు. కర్నాటక ప్రాంతంలోని ఉడిపిలోని శ్రీకృష్ణ మఠంలో చంద్రబాబు మరోసారి సీఎం కావాలని ప్రత్యేక పూజలు చేపట్టినట్లు వెల్లడించారు. టీడీపీ నాయకులు కంబదూరు సురేంద్ర, పాలబండ్ల శ్రీరాములు, అమర రామ్మోహన్‌చౌదరి, మాజీ ఎంపీపీ వన్నూరుస్వామి, సంతే కొండాపురం సర్పంచ్ మల్లి, అంకె యర్రిస్వామి, డాబా నాగరాజు పూజా కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

రైతులకు రూ.6.44కోట్ల నష్ట పరిహారం

యాడికి, మే20: ఖరీఫ్ 2023 పెట్టుబడి రాయితీ (పంట నష్టపరిహారం) విడుదలైనట్లు ఏఓ తెలిపారు. మండలంలోని 5512మంది రైతులకు రూ.6.44కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. రైతుల పంట నష్ట వివరాలు తమతమ రైతు భరోసా కేంద్రాల్లో చూసుకోవాలన్నారు. జాబితాలో పేరు ఉండి డబ్బు జమకానీ రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో కానీ, మండల వ్యవసాయ కార్యాలయంలో గానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

జాబ్‌మేళాకు స్పందన


ఉద్యోగాలకు ఎంపికైన యువత

రాయదుర్గంరూరల్, మే 20: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 90 మంది విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకాగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. సెలెక్ట్ అయినవారు సియోన్ కంపెనీ పెనుకొండ వద్ద జూన్ మొదటి వారంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివ, చందు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హర్ష, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ రాము, లెక్చరర్స్, షబానా, ఆలీషా, కలాం పాల్గొన్నారు.

22.0 మి.మీ. వర్షపాతం

రాయదుర్గంరూరల్, మే 20: పట్టణం, రూరల్ ప్రాంతంలో ఆదివారం రాత్రి 22.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. సాయంత్రం నుంచే ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో జలమయ్యాయి. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, పంటకుంటలలో నీరు చేరింది. సేద్యం చేసేందుకు సరైన సమయంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదును వర్షం కురవడంతో పొలాల్లోకి వెళ్లి సేద్యం పనులను ప్రారంభించారు.

అదుపు తప్పిన కారు.. ఐదుగురికి గాయాలు

విడపనకల్లు, మే 20: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద బళ్లారి-అనంతపురం 42వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట జిల్లా ఇలుకల్లు పట్టణానికి చెందిన ఐదుగురు స్నేహితులు నాలుగు రోజుల కిందట కారులో తిరుమలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి సొంతూరికి బయల్దేరారు. సోమవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద 42వ జాతీయ రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారుతో ఢీ కొట్టారు. దీంతో కారు అదుపుతప్పి ఎడమ వైపు నుంచి కుడి వైపునకు వెళ్లి చెట్టును ఢీ కొట్టి పొలాల్లో పడింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు స్నేహితుల్లో ఆనందు, సురేష్ తీవ్రంగా గాయపడగా, బసవరాజు, గిరీష్, అదానప్ప స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని బళ్లారి ఆసుపత్రికి తరలించినట్లు విడపనకల్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఉరవకొండ, మే 20: మండలంలోని బూదగవి సమీపంలోని పాల్తూరు క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లికార్జున ఆచారి(65) మృతి చెందాడు. విడపనకల్లు మండలం ఉండబండ గ్రామానికి చెందిన మల్లికార్జున ఆచారి శుభకార్యాలలో వంట మనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ద్విచక్రవాహనంపై ఉరవకొండకు బయలు దేరాడు. అనంతపురం- బళ్లారి రహదారిలో పాల్తూరు క్రాస్ వద్ద కారు, ద్విచక్రవాహనంలో ఢీకొనడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.